ప్రయాణం.. భయం భయం..

- అధ్వానంగా కాటన్ బ్యారేజీ రోడ్డు
- అడుగడుగునా గోతులు
- వాహనచోదకుల అవస్థలు

ధవళేశ్వరం: ఉభయ గోదావరి జిల్లాల వరప్రదాయిని ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ రోడ్డు అధ్వానంగా మారింది. బ్యారేజీపై రోడ్డు గోతుల మయంగా మారడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధవళేశ్వరం నుంచి బొబ్బర్లంక, విజ్జేశ్వరం తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీనే వినియోగిస్తారు. దీనికి తోడు అరటి , కొబ్బరి రైతులు రాజమహేంద్రవరం వెళ్లేందుకు కాటన్ బ్యారేజీ మీదుగా రాకపోకలు సాగిస్తారు.

భారీ గోతులు

బ్యారేజీ రోడ్డుపై అనేక చోట్ల భారీగా గోతులు పడ్డాయి. ఇనుప ఊచలు సైతం బయటకు



గోతులమయంగా మారిన కాటన్ బ్యారేజీ రోడ్డు

చొచ్చుకువచ్చాయి. దీనిపై దృష్టి సారించాల్సిన ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ అధికారులు సమస్యను పూర్తిగా పక్కన పెట్టేశారు. బ్యారేజీ రోడ్డుకు మరమ్మతులు సైతం చేపట్టకుండా వదిలేస్తుండటంతో గోతులు మరింత పెద్దగా మారి రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. కాటన్ బ్యారేజీ ప్రధానంగా ఆయకట్టుకు నీరు విడుదల చేసేందుకు నిర్మించిన కట్టడం . తదనంతర కాలంలో బ్యారేజీపై వాహనాల రాకపోకలకు రోడ్డు ఏర్పాటు చేశారు. బ్యారేజ్‌పైకి గతంలోనే భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుపై తారు తొలగించి గోతులు పూడిస్తే కొంత వరకూ ప్రయాణికులకు ఇబ్బందుల తొలగుతాయని నీటిపారుదలరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. బ్యారేజీ రోడ్డుపై వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

సమస్యపై దృష్టి సారించాలి

బ్యారేజ్‌పై రోడ్డు అధ్వానంగా మారినా ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గతంలో ప్రజాప్రతినిధులు సైతం సూచించినా ఇరిగేషన్ అధికారులలో చలనం లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టే అవకాశం ఉన్నా దీనిపై దృష్టి సారించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: పాఠశాలకు, గుడికి స్థలాలను దానం చేసి పాత బొమ్మూరు గ్రామ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన యనమదల వెంకటేశ్వరరావు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. గురువారం పాతబొమ్మూరులో ఏర్పాటు చేసిన యనమదల వెంకటేశ్వరరావు విగ్రహాన్ని ఆయన, ప్రముఖులు ఆవిష్కరించారు. గోరంట్ల మాట్లాడుతూ యనమదల వెంకటేశ్వరరావు తండ్రి విశ్వేశ్వరరావు గ్రామ మున్సబ్‌గా అందరికి సుపరిచితులన్నారు. మాజీ సర్పంచ్‌లు మద్దిపోటి శంభాజీరావు, మత్సేటి ప్రసాద్, గ్రామపెద్దలు మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు అల్లుళ్లు, కుమార్తెలు సీఈ ఎంవీఎస్ రాము, మద్దిపోటి సుజాత, మల్లిన సత్య శ్రీనివాసరావు, మల్లిన రాజేశ్వరిదేవి, ఎస్‌వీవీకే సురేష్ కుమార్, నూనె విశ్వేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చేనేత మంత్రి అమర్నాథ్‌కు వినతి

కడియం: చేనేత, జౌళి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయనను అనకాపల్లిలో కలిసి సంఘాలకు రావాల్సిన వివిధ పథకాల సొమ్మును రిలీజ్ చేయించాల్సిందిగా కోరారు. అలాగే జీఎస్‌టీ ఇబ్బందులను మంత్రికి వివరించారు. రాష్ట్ర స్థాయిలో చేనేత బలోపేతానికి సహకార సంఘాల సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సమస్యలపై మంత్రి అమర్నాథ్ సానుకూలంగా స్పందించారని సూర్యనారాయణ స్థానిక విలేకరులకు తెలియజేశారు. వినతిపత్రం అందించిన వారిలో చేనేత సంఘాల చైర్మన్లు దొంతంశెట్టి వీర్రాజు, వట్టి సూర్యనారాయణ, ఉప్పు బుల్లిరాజు, శలా పరమేశ్వరరావు, దొంతంశెట్టి సత్యప్రకాష్, వాసా వీర్రాజు, పోతురాజు ఉన్నారు.



మంత్రి అమర్నాథ్‌ను కలిసిన యర్రా సూర్యనారాయణ తదితరులు

వ్యక్తికి ఐదేళ్ల జైలు

కంబాలచెరువు: తన కంపెనీలో చేరి సెల్‌ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు పంపితే అధిక సొమ్ములు ఇస్తామని మోసం చేసిన నెల్లూరుకు చెందిన చిల్లక చంద్రమౌళిరెడ్డికి ఐదేళ్ల జైలు విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్ కుమార్ గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. 2015లో రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓషియన్ మీడియా ఐటీ సొల్యూషన్ పేరుతో చంద్రమౌళి, మరో ఇద్దరు కంపెనీ పెట్టారు. తమ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి ఎస్‌ఎంఎస్‌లు పంపితే రెట్టింపు సొమ్ములు ఇస్తామని చెప్పడంతో అధిక సంఖ్యలో కంపెనీలో చేరి వారు చెప్పిన విధంగా చేశారు. కొంతకాలం నమ్మకం కుదిరే విధంగా వారికి సొమ్ములు ఇచ్చేవారు. తర్వాత అధిక మొత్తంలో సొమ్ము వసూలు చేసి ఆఫీసు మూసి పారిపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కోర్టు తీర్పు చెప్పింది. కేసును అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు వాదించారు.

జీవకారుణ్య సంఘం అభివృద్ధికి కృషి



బర్రే కొండబాబును సత్కరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ జీవకారుణ్య సంఘం అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. సంఘం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన క్వారీ ప్రాంతానికి చెందిన నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ 49వ డివిజన్ ఇన్‌చార్జి బర్రే కొండబాబును గురువారం ఆయన ఇంటివద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా సత్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలు, అట్టడుగు వర్గాలకు చెందిన వృద్ధులకు ఆశ్రయం ఇస్తున్న గౌతమీ జీవకారుణ్య సంఘం ఉన్నతికి అవసరమైన సహకారాన్ని నిరంతరం అందిస్తామని ప్రకటించారు. సిటీ కోఆర్డినేటర్‌గా నియమితులైన తర్వాత ప్రప్రథమంగా 49 డివిజన్ లోకి అడుగు పెట్టిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులకు కొండబాబు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ కార్పొరేటర్లు గూడూరి రాధిక, అజ్జరపు వాసు, చోడిశెట్టి సత్యవాణి, వైఎస్సార్ సీపీ నాయకులు నందం స్వామి, కొమ్ము జిగ్లేర్, తిరగటి దుర్గ, గారా చంటిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కడియంలో అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: మండల కేంద్రమైన కడియంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ గురువారం శంకుస్థాపనలు చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. సదరు హామీలను నెరవేరుస్తూ ఆయా పనులకు నాగేశ్వర్ శంకుస్థాపనలు చేశారు. సచివాలయం 4 పరిధిలోని భాస్కర్‌రామ్ నగర్‌లో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, కడియం - వీరవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి భాస్కర్ నగర్ వరకూ అప్రోచ్ రోడ్డుకు రూ.7.2 లక్షలు, ఎలిమెంటరీ స్కూలు వద్ద సీసీ రోడ్డుకు రూ.2.8 లక్షలు, సీసీ డ్రైనేజీకి రూ.10 లక్షలు కేటాయించామన్నారు. వీటిని త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చందన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, ఆలయ చైర్మన్లు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, బండారు శ్రీనివాస్, వారు సభ్యులు పసల నాయుడు, శ్రీను, దాసరి నాగేంద్ర, పార్టీ నాయకులు శాక పట్టాభి, లావేటి రమేష్, దొడ్డా బుజ్జి, గుత్తుల వాసు, పూడి బ్రహ్మం, సర్కార్ బాషా, కడియం గణేష్, పెంకే రామకృష్ణ, పున్నమిరాజు వీర్రాజు, వీరనాగు, మణికంఠ పాల్గొన్నారు.

ఆయాల సమస్యలు పరిష్కరించాలి

ప్రకాశం నగర్: జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేస్తున్న ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ కోటగుమ్మం డీఈఓ కార్యాలయం వద్ద చేపట్టిన నిరశన గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు సీఐటీయూ మద్దతు ప్రకటించింది. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ కలెక్టర్ స్పందించి ఆయాల సమస్యలను పరిష్కరించాలన్నారు.

చిరస్మరణీయుడు సుందరాచారి

ప్రకాశం నగర్: మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీత రచయిత శంకరంబాడి సుందరాచారి చిరస్మరణీయుడని రాజమండ్రి ఆర్ట్స్ అండ్ కల్చరల్ క్రియేటివ్ అసోసియేషన్ (రాకా) ప్రధాన కార్యదర్శి జీవీ రమణ అన్నారు. స్థానిక కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో రాకా ఆధ్వర్యంలో గురువారం సుందరాచారి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. హెచ్‌ఎం పులుగుర్త దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక సీపీ బ్రౌన్ మందిరంలో శంకరంబాడి సుందరాచారి జయంతి ఘనంగా నిర్వహించారు. రాకా వ్యవస్థాపక కార్యదర్శి జీవీ రమణ, ప్రముఖ న్యాయవాది కేవీఎల్ భవాని, ఆర్కిటెక్ట్ కల్లూరి సోమయాజులు, డాక్టర్ ముసునూరి అయ్యప్ప పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

రాజమహేంద్రవరం సిటీ: ఓటర్ల జాబితాను సవరణను పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. ఓటర్ల సవరణకు ఉపయోగించే మొబైల్ యాప్ నిర్వహణపై బూత్ లెవెల్ అధికారులు, సూపర్ వైజర్లకు గురువారం వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు, బదిలీ, తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా కీలకమైనదని, ఎన్నికలకు ప్రధాన పునాది ఓటర్ల జాబితాయేనన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. జాబితా సవరణలో ఎటువంటి పొరపాట్లు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ ఓటరు సవరణ కార్యక్రమాన్ని విమర్శలకు అతీతంగా జాగరూకతతో పూర్తిచేయాలన్నారు. మొబైల్ యాప్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మల్లిబాబు, నగరపాలకసంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, మొబైల్ యాప్ టెక్నికల్ ఆఫీసర్ మల్లికార్జున్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

గ్రామీణ తపాలా ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: గ్రామీణ తపాలా ఉద్యోగుల న్యాయమైన 11 డిమాండ్లను నెరవేర్చాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి పి.భూలోకం డిమాండ్ చేశారు. గురువారం స్థానిక హెడ్ పోస్టాఫీసు ఎదుట కేంద్ర గ్రామీణ డాక్ సేవక్స్ (గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం), పీజే సీఏ దేశవ్యాప్త పిలుపు మేరకు ఒక్కరోజు ధర్నా చేశారు. ఈ సందర్భంగా భూలోకం మాట్లాడుతూ జీడీఎస్ కమిటీ సిఫార్సు చేసిన విధంగా సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24 ,36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు, ఇతర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. రామచంద్రపురం బ్రాంచ్ కార్యదర్శి మునీశ్వరరావు, అధ్యక్షుడు వై.స్పర్జన్ రాజు, డివిజన్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, ట్రెజరర్ రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ బీవీ రమణ, పోస్టల్ కో ఆపరేటివ్ సొసైటీ మెంబర్ రాధాకృష్ణ, రామచంద్రపురం బ్రాంచ్ కోశాధికారి వై.కామేశ్వరి పాల్గొన్నారు. అనంతరం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



ధర్నా చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

క్రమశిక్షణతో మంచి ఫలితాలు

బిక్కవోలు: క్రమశిక్షణతో మంచి ఫలితాలు వస్తాయని పందలపాక ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తుందన్నారు. విద్యార్థులంతా క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో ఉపాధ్యాయులే కాకుండా ఇంటి వద్ద తల్లిదండ్రులు సైతం తమ పిల్లల చదువు విషయంలో బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిర్ల శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ జీవితంలో భాగం కావాలి

రంగంపేట: ప్రతిఒక్కరి జీవితంలో సత్యసాయి నామస్మరణ, సమాజ సేవ భాగం కావాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప అమరనాథ్ సూచించారు. గురువారం మండలంలోని కొత్త కోటపాడులో సత్యసాయి సేవా సదన్ 28వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రశాంతి పతాకను ఆవిష్కరించి, బాబా పాదుకలకు, చిత్రపటానికి సహస్ర నామార్చన చేశారు. గ్రామంలో బాబా చిత్రపటాన్ని, దివ్యాంబరాన్ని ఊరేగించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అచ్యుతాపురంలో కిడ్నాప్ కలకలం

- స్కూల్‌కి వెళ్లకుండా ఓ ఇంట్లో దాక్కొన్న విద్యార్థులు
- మూడు గంటల పాటు ఉత్కంఠ
- పిల్లలు దొరకడంతో ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో కిడ్నాప్ కలకలం రేగింది. విద్యార్థులు స్కూల్‌కి వెళ్లలేదని తెలియడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని గ్రామంలో ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో చిన్నారులు దాక్కొన్నట్టు గుర్తించడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే...అచ్యుతాపురం ఎస్సీకాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మైలపల్లి నాగేంద్ర, శశికళకు చెందిన ఎనిమిదేళ్ల భవ్య, ఆరేళ్ల సుస్మిత స్థానికంగా ఉన్న ఎంపీపీ పాఠశాలలో చదువుకుంటున్నారు. వీళ్లు రెండు రోజుల నుంచి పాఠశాలలకు వెళ్లలేదు. గురువారం తల్లి వీరిని పాఠశాలకు పంపించగా వీరు స్కూల్‌కు వెళ్లలేదు. పాఠశాల ఉపాధ్యాయులు తండ్రికి ఫోన్ చేసి పిల్లలు పాఠశాలకు రాలేదని చెప్పడంతో ఆటో కిరాయికి వెళ్లిన నాగేంద్ర గ్రామానికి వచ్చి పిల్లల గూర్చి భార్యను ప్రశ్నించాడు. పిల్లలు ఇద్దరు ఉదయమే పాఠశాలకు వెళ్లారని ఆమె బదులు చెప్పడంతో కంగారు పడి తల్లిదండ్రులు ఇద్దరూ స్కూల్‌కి వెళ్లి విచారించగా స్కూల్‌కి రాలేదని తెలిసింది. విషయం స్థానికులకు కూడా తెలియడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గ్రామంలో గాలించారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.



బంధువుల చెంతకు చేరిన విద్యార్థులు భవ్య, సుస్మిత

ముమ్మరంగా గాలించి

ఎస్సై శివనాగబాబు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో ప్రతి ప్రదేశాన్ని గాలించారు. అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. సోషల్ మీడియా ద్వారా గ్రూపుల్లో పిల్లల ఆచూకీ కోసం ఆరా తీశారు. గ్రామంలో ఉదయం సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసేవారు ఇంటింటికీ తిరిగారని సమాచారం తెలియడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో ఉదయం పాఠశాలకు వెళతామని చెప్పిన చిన్నారులు పాఠశాలకు సమీపంలో ఓ షాపు వద్ద చాక్లెట్లు కొనుక్కున్నారని గుర్తించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. పిల్లలకు వరుసకు చిన్నాన్న అయిన ఓ వ్యక్తి నూతనంగా ఇంటిని నిర్మించుకోవడంతో ఆ ఇంట్లో ఓ గదిలో దాక్కొని ఉన్న వీరిని స్థానికులు గుర్తించారు. మూడు గంటల ఉత్కంఠ అనంతరం పిల్లల ఆచూకీ లభ్యమైంది. పోలీసులు ఇద్దరు చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ బాలుడిని గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లే ప్రయత్నం చేశాడని, గుర్తించిన స్థానికులు కేకలు వేయడంతో విడిచిపెట్టాడని ఇప్పుడు కూడా అటువంటి సంఘటనే జరిగి ఉంటుందని భయపడ్డామని గ్రామస్తులు తెలిపారు.

420 మందికి వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 420 మందికి వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్ఎం జ్యోతి, ఆశావర్కర్లు వెంకట కుమారి, లక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అక్రమాస్తులను నిరూపించే సత్తా ఉందా!

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు
- చంద్రబాబుపై జక్కంపూడి విజయలక్ష్మి ధ్వజం

మధురపూడి: జక్కంపూడి కుటుంబం అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకుని, విలాసవంతమైన భవనాల్లో ఉంటున్నట్టు ఆరోపణలు చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు.. వాటిని నిరూపించే సత్తా ఉందా అని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రశ్నించారు. కోరుకొండ మండలం నర్సాపురం రోడ్డులోని పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు గెస్ట్‌హౌస్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల చంద్రబాబు పర్యటనలో చేసిన గ్లోబల్స్ ప్రచారంపై ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రభుత్వంపై ప్రజలకు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు నిందారోపణలు చేస్తున్నారన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజల కోసమే జీవిస్తున్న జక్కంపూడి కుటుంబంపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే కుటుంబమంతా రాజకీయ సన్యాసం తీసుకుంటామన్నారు. లేకుంటే చంద్రబాబు కుటుంబం రాజకీయ సన్యాసానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన వారిని బషీర్‌బాగ్‌లోనూ, కాల్దరిలో ఇద్దరు రైతులను కాల్చి చంపించిన చంద్రబాబు మాటలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించి అన్నదాతకు అండగా నిలిచారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, నాయకులు ఉల్లి బుజ్జిబాబు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, బొరుసు బద్రి, నేతుల చిన్ని, పసుపులేటి బుల్లియ్య నాయుడు, కొండపల్లి దుర్గారావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సాక్షి-సినిమా



శ్యామల:	జైలర్
సూర్యమినీ:	గదర్-2
సూర్యప్యాలెస్:	భోళాశంకర్
స్వామి:	భోళాశంకర్
శివజ్యోతి:	భోళాశంకర్
అనుశ్రీ:	బ్రో
రాజా:	భోళాశంకర్
అశోక:	జైలర్
ఊర్వశి:	జైలర్
రంభ:	భోళాశంకర్
మేనక:	కృష్ణగాడు అంటే ఒకరేంజ్, ప్రియమైనప్రియ
అప్సర:	బేబి
నామవరం:	
వీఎస్.మహల్:	భోళాశంకర్
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	భోళాశంకర్
కడియం:	
వెంకటసూర్య:	భోళాశంకర్

క్లుప్తంగా

ఘనంగా తైలాభిషేక పండగ

కడియం: స్థానిక హైస్కూల్ వెనుక గల షారోను దైవిక స్వస్థత శాలలో తైలాభిషేక పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. నలభై రోజుల సుఖోపవాసాల తర్వాత ఏటా మాదిరిగానే నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి క్రైస్తవులు హాజరయ్యారు. స్వస్థతశాల నిర్వాహకుడు డి.రత్నరాజు ప్రార్థనలు చేశారు. గుమ్మడి ఎలీసమ్మ, గెడ్డం రత్నం, పాదూరి భాగ్యవతి అల్పాహారం అందించారు. డి.సరోజిని రత్నరాజు ఆధ్వర్యంలో స్తుతి ఆరాధనలు జరిగాయి. యూత్ సభ్యులు, సన్నిధి స్త్రీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాఠశాల తనిఖీ



ఆనంద్ నగర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో అబ్రహం

కంబాలచెరువు: స్థానిక ఆనంద నగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం తనిఖీ చేశారు. పాఠ్యాంశాల బోధన, సిలబస్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం 9వ తరగతిని సందర్శించి ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. పాఠ్యాంశాల బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

సీటీఆర్ఐ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పాల్గొని మద్దతు తెలిపాయి. 14, 15 ఆర్థిక సంఘం పంచాయతీ నిధులను దారి మళ్లించి, గ్రామ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విఘాతం కలిగించిందని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందించారు.

ఎస్తేరు రాణి సేవలు చిరస్మరణీయం



పేదలకు ఆహారం వితరణ చేస్తున్న దృశ్యం

ధవళేశ్వరం: అంధులు, అనాథలకు దివంగత ఎస్తేరు రాణి చేసిన సేవలు చిరస్మరణీయమని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు బెన్నిబాబు అన్నారు. ధవళేశ్వరంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో గురువారం జియోన్ అంధుల పాఠశాల వ్యవస్థాపకురాలు దివంగత ఎం.ఎస్తేరురాణి జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు బెన్నిబాబు, సుగంధి, విజయ్, హెప్సిబా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే చెప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, కేవీఆర్ సాగర్, బసనబోయిన దుర్గ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్‌జీవో నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ఖజానా అధికారి ఎన్.సత్యనారాయణ అన్నారు. ఈ నెల 21న ఏపీ ఎన్‌జీఓ తలపెట్టిన ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌జీఓ రాష్ట్ర మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరు కావడం ఉద్యోగులపై ఆయనకున్న అభిమానాన్ని తెలుపుతోందన్నారు. కార్యక్రమంలో నగర ఎన్‌జీఓ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు నాయుడు, ప్రవీణ్, జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కంబాలచెరువు: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ముత్తారావు యూటీఎఫ్ భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో జరుప తలపెట్టిన 12 గంటల సామూహిక నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, జీవో నెంబర్ 117 ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోశాధికారి ఈవీఎస్ఆర్.ప్రసాద్, శ్రీమణి, ఐ.రాజేశ్వరి, సుధారాణి పాల్గొన్నారు.